

దత్తతపై ఆసక్తి



- జిల్లాలో 15 ఏళ్లలో 96 మంది పిల్లల అడాప్షన్
- ఇతర రాష్ట్రాలు, విదేశీ దంపతులకు పిల్లల దత్తత
- అధికారుల పర్యవేక్షణలో.. చట్టబద్ధంగా ప్రక్రియ

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వివాహం జరిగి ఐదు సంవత్సరాలైనా ఆ దంపతులకు సంతానం కలగలేదు. ఆసుపత్రులు తిరిగి వేసారిపోయారు. ఆర్థికంగా ఉన్నతస్థితిలో ఉన్న ఆ దంపతులు సంతానంలేని లోటు వెంటాడుతుండటంతో మానసికంగా ఇబ్బందిపడ్డారు. బంధువుల వద్దకు వెళ్లిన సమయంలో, శుభకార్యాలకు వెళ్లిన సందర్భంలో సంతానంలేని విషయాన్ని బంధువులు అడిగేవారికి ఏమి సమధానం చెప్పాలో తోచక కొంత ఇబ్బందిపడు తుండేవారు. చివరకు ఒక నిర్ణయానికి వచ్చి కరీంనగర్ శిశుగృహలోని పిల్లలను దత్తతకు తీసుకోవాలనుకున్నారు. కరీంనగర్ డీసీపీ (డిస్ట్రిక్ట్ చైల్డ్‌ప్రొటెక్షన్) అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఒక బాబును దత్తతకు తీసుకున్నారు. ఆ బాబుతో సంతోషంగా కాలం గడుపుతున్నారు.

ఇలా వివాహానంతరం వివిధ కారణాలతో సంతానం కలుగని దంపతులు.. ఒక సంతానం ఉన్నప్పటికీ మరో సంతానం కావాలనుకునేవారు, ఆడపిల్ల ఉండి మగ పిల్లవాడు లేనివారు, మగపిల్లవాడు ఉండి ఆడ పిల్ల లేనివారు పిల్లలను చట్టరీత్యా దత్తత తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. గతంలో సమీప బంధువుల పిల్లలనే దత్తత తీసుకునే వారు. మారిన కాలంతోపాటు ప్రభుత్వ నిబంధనల మేరకు శిశుగృహ నుంచి అనాథ పిల్లలను దత్తత తీసుకుంటున్నారు.

ఆడపిల్లల వైపే మొగ్గు

కరీంనగర్ జిల్లాలోని శిశుగృహ, చైల్డ్‌కేర్ సెంటర్‌లలోని పిల్లలను దేశంలోని వివిధ రాష్ట్రాలతో (ఇన్‌కంట్రీ)తో పాటు విదేశాల్లోని (ఇంటర్ కంట్రీ) వారికి కూడా సంబంధిత అధికారులు దత్తత ఇస్తున్నారు. ఆ పిల్లల బాగోగులను చూడటంతోపాటు సంతానం లేని దంపతులకు వారిని చట్టబద్ధంగా దత్తతనిస్తున్నారు. దత్తత తీసుకుంటున్న వారిలో ఆడపిల్లల సంఖ్య ఎక్కువగా ఉండడం విశేషం. చట్టాన్ని అధిగమించి పిల్లలను దత్తత తీసుకోవడం నేరమని, అందుకు శిక్షలు కూడా ఉన్నాయని స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

పిల్లలపై నిరంతర పర్యవేక్షణ...

సంతానం లేని దంపతుల దరఖాస్తులను పరిశీలించి డీసీపీ (డిస్ట్రిక్ట్‌చైల్డ్‌ప్రొటెక్షన్) అధికారులు వారికి పిల్లలను దత్తతనిస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా కలెక్టర్ పర్యవేక్షణలో జరుగుతుంది. స్వదేశంలో, విదేశాలకు చెందిన దంపతులకు పిల్లలను దత్తతనిస్తున్నప్పటికీ ఆ పిల్లల సంరక్షణను స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారులు పర్యవేక్షిస్తారు., స్వదేశంలో అయితే దత్తత ఇచ్చిన జిల్లా అధికారులు దత్తత తీసుకున్న దంపతుల నివాసానికి చే ర ు వ లో ని ఐసీడీఎస్ అధికారుల ద్వారా పర్యవేక్షిస్తారు. దత్తతపై విదేశాల కు వెళ్లిన చిన్నారులను ఏఎఫ్ఏ (ఆథరైస్డ్ ఫారెన్ అడాప్షన్) అనే ఏజెన్సీ ద్వారా పర్యవేక్షిస్తారు.

అర్హతలు...

- పిల్లలు లేని దంపతులు, వితంతువులు, విడాకులు తీసుకున్నవారు, ఒంటరిగా జీవిస్తున్నవారు పిల్లలను దత్తత తీసుకోవచ్చు.
- దరఖాస్తుదారులు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా స్థిరత్వం కలిగి ఉండాలి. ఎటువంటి ప్రాణాంతక వ్యాధులు కలిగి ఉండరాదు.
- నేర చట్టాల ప్రకారం శిక్ష అనుభవించిన వారు, బాలల హక్కులను దుర్వినియోగ పరిచిన వారు పిల్లలనుదత్తత తీసుకునేందుకు అనర్హులు.
- ఒంటరి మహిళలు అబ్బాయిని కాని, అమ్మాయినికాని దత్తత తీసుకోవచ్చు.
- ఒంటరి పురుషుడు బాలుడిని మాత్రమే దత్తత తీసుకోవాలి.
- దత్తతకు దరఖాస్తు సమర్పించే నాటికి దంపతుల పెళ్లి జరిగి రెండు సంవత్సరాలు పూర్తి అయి ఉండాలి.
- ఇద్దరు పిల్లలు ఉన్న దంపతులు కేవలం అంగవైకల్యం ఉన్న పిల్లల దత్తత కోసమే దరఖాస్తు చేసుకోవాలి.
- తోబుట్టువులను ఒకే కుటుంబానికి దత్తత ఇస్తారు.
- నివాసం ఉంటున్న జిల్లాలోనే పిల్లల దత్తత కోసం దరఖాస్తును సమర్పించాలి.
- దంపతులు జాయింట్ ఫొటోలు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డులు, జనన ధ్రువపత్రాలు (విద్యాసంస్థలు జారీ చేసినవి), ఆదాయ ధ్రువపత్రం (సాలరీ సర్టిఫికెట్/ఆదాయపన్ను రిటర్న్స్/ రెండు లక్షలపైన ఆదాయ ధ్రువీకరణ పత్రం) సమర్పించాలి.

మిగతా 8వ పేజీలో

96 మంది పిల్లల దత్తత

పిల్లలను దత్తత కోరుతూ ఆయా దంపతులు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా వారిని సంప్రదించి, ఆ దంపతుల ఆర్థిక స్థోమత, ఆరోగ్య పరిస్థితి, కుటుంబ నేపథ్యాన్ని పరిశీలించి స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు వారి పర్యవేక్షణలోని ఐదేళ్లలోపు పిల్లలను దత్తతనిస్తున్నారు. పలు సీసీఐలలోని 16 ఏళ్లలోపు పిల్లలను కూడా పలువురు దత్తత తీసుకుంటున్నారు. జిల్లాలోని శిశుగృహ నుంచి 91 మంది పిల్లలను దేశంలోని దంపతులకు, మరో ఐదుగురికి విదేశాలకు చెందిన దంపతులకు దత్తతకు ఇచ్చారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో జిల్లాలో శిశుగృహ, చైల్డ్‌కేర్ సెంటర్‌లలోని పిల్లలను దత్తత తీసుకునేందుకు చాలామంది దంపతులు ఆసక్తి చూపు తున్నారు. ఇష్టం లేని గర్భమని, ఆడపిల్ల పుట్టిందనే కారణంగా... పిల్లలను పలువురు తల్లి దండ్రులు వదిలేసి వెళుతున్నారు. ప్రమాదాల్లో, అనారోగ్యంతో తల్లిదండ్రులు చనిపోయిన పిల్లలు అనాథలుగా మారుతున్నారు. ఇలాంటి చిన్నారులను స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్(డీసీపీ) అధికారులు చేరదీసి 0-5 ఏళ్ళలోపు పిల్లలను శిశుగృహలో, 6-16 ఏళ్ళలోపు పిల్లలను చైల్డ్‌కేర్ సెంటర్లలో ఉంచుతున్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సెంట్రల్ అడాప్షన్ రీసోర్స్ అథారిటీ(కారా) మార్గదరశకాలకనుగుణంగా దేశం మొత్తం ఒకే విధమైన కేంద్రీకృత విధానం ద్వారా పిల్లలను దత్తత ఇస్తున్నారు. జిల్లాలో 2011 నుంచి 2025 ఇప్పటి వరకు 65 మంది బాలికలు, 31 మంది బాలురను మొత్తం 96 మందిని దత్తత ఇచ్చారు.



రాష్ట్రాలు, దేశాల వారీగా దత్తత వివరాలు

ఇన్‌కంట్రీ	పిల్లలు
తెలంగాణ	77
ఆంధ్రప్రదేశ్	4
తమిళనాడు	3
కర్ణాటక	3
మహారాష్ట్ర	2
ఒడిసా	1
ఢిల్లీ	1
ఇటలీ	3
యూఎస్ఏ	1
సింగపూర్	1
మొత్తం	96

వయస్సు వారీగా దత్తత ఇచ్చే పిల్లల వివరాలు

భార్యాభర్తల ఇద్దరి వయస్సు కలిపి	ఒంటరి వ్యక్తి వయస్సు	పిల్లల వయస్సు
85 ఏళ్లలోపు	40 ఏళ్లలోపు	0-2 ఏళ్లు
90	45	2-4
100	50	4-8
110	55	8-18

దత్తత ఇచ్చిన పిల్లల వివరాలు 2011 నుంచి

సంవత్సరం	బాలికలు	బాలురు	మొత్తం
2011	4	3	7
2012	1	0	1
2013	3	6	9
2014	1	1	2
2015	9	2	11
2016	4	3	7
2017	1	0	1
2018	3	2	5
2019	5	0	5
2020	6	1	7
2021	2	1	3
2022	8	2	10
2023	5	4	9
2024	12	5	17
2025	1	1	2
	66	31	96

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను పెంచాలి



డీవైఎస్‌వోకు వినతిపత్రం ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): క్రీడాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల సంఖ్యను పెంచాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. జిల్లాలో 10 క్రీడా శిక్షణ శిబిరాలను మాత్రమే నిర్వహిస్తున్నామని, అందుకు దరఖాస్తులను అందించాలని క్రీడాశాఖ ప్రకటించింది. జిల్లాలో 16 మండలాలు ఉండగా మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఉన్న ఉత్సాహవంతులైన విద్యార్థులకు, యువకులకు క్రీడా శిక్షణ ఈ వేసవిలో అందించాల్సిన బాధ్యత క్రీడా శాఖపై ఉందని పెటా టీఎస్ బాధ్యులు వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న మండలాల సంఖ్యనుబట్టి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను పెంచాలని ఆ సంఘం ప్రతినిధులు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారిని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్,ఉపాధ్యాయులు వీరన్న, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి పోతన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా లోని 15 మండలాల్లో పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్‌ను వందశాతం పూర్తి చేయాలన్నారు. రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన 15 గ్రామాల్లో 2,027 మందికి ఇళ్లు మంజూరు చేశామన్నారు. 730 ఇళ్లకు మార్కింగ్ పూర్తయిందన్నారు. 114 ఇళ్లు బేస్‌మెంట్ దశలో ఉన్నాయన్నారు. మంజూరైన మొత్తం ఇళ్లకు మార్కింగ్ చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. రెండో విడత ఇళ్లను గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా మంజూరు చేసేందుకు అలాట్‌మెంట్ జాబితా తయారు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపికకు కట్టుదిట్టమైన కార్యాచరణ అమలు చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో అత్యంత నిరుపేదలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీటీడీవో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎల్ఆర్ఎస్ అమలు

కరీంనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎల్ఆర్ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ ఆదేశించారు. గురువారం ఆయన ఎల్ఆర్ఎస్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ ఏప్రిల్ 30 వరకు ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లిస్తే 25 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను జిల్లాలో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఫీజు చెల్లించిన దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్స్ సత్వరమే జారీచేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ చెల్లింపులు ఏప్రిల్ 30 లోపు కడితే 25 శాతం రాయితీపై ప్రజలకు వివరించేలా ప్రచారం నిర్వహించాలన్నారు.

జిల్లావ్యాప్తంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

భగత్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు వేయనున్నట్లు జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మే 14వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో టీకాలు వేయడానికి కార్యాచరణ రూపొందించామన్నారు. అన్ని మండలాల్లో పశువైద్య అధికారులు సమావేశం నిర్వహించి సూచనలు చేయాలన్నారు. ఎండలు వడగాలులు తీవ్రంగా ఉన్నందున పశువులను చల్లటి ప్రదేశాల్లో ఉంచాలన్నారు. పశువులకు అనారోగ్య సమస్య ఉన్నట్లు తెలిస్తే సమీపంలోని పశువైద్యశాలను సంప్రదించాలన్నారు. సంయుక్త సంచాలకులు డాక్టర్ టి సుధాకర్, సహాయ సంచాలకులు డాక్టర్ వినోద్‌కుమార్‌ల పర్యవేక్షణలో టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

నేడు గుడ్‌ఫ్రైడే

చర్చిల్లో ఏర్పాట్లు



గుడ్‌ఫ్రైడే ప్రార్థనలకు ముస్తాబవుతున్న వెస్లి కెథడ్రిల్ చర్చి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్ర జ్యోతి): ఏసుక్రీస్తు శిలువ వేసిన రోజును క్రైస్తవు లు గుడ్‌ఫ్రైడేగా శుక్రవారం జరుపుకుంటారు. శిలువ వేసిన మూడో రోజు ఈస్టర్‌గా ఆదివారం జరుపుకుంటారు. దీనినే పునరుత్థాన దినంగా చెబుతారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. భక్తి గీతాలు ఆలపిస్తారు. గుడ్‌ఫ్రైడే నుంచి వారం రోజుల పాటు వేడుక లను నిర్వహిస్తారు. ఈస్టర్‌కు ముందు రోజు శనివారం రాత్రి చర్చిల్లో కొవ్వొత్తులు వెలిగిస్తారు.

నేడు చర్చిల్లో ప్రార్థనలు - ప్రసంగాలు..

గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పర్వదిన సంద ర్భంగా చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలతో అలంకరించారు.ప్రార్థనలు, ప్రసంగాలకు ఆయా చర్చిల యజమాన్యాలు ఏర్పాట్లు చేశాయి. శుక్రవారం కమిషనర్ కార్యాలయం వద్ద గల వెస్లి కెథడ్రిల్, విజయ రఘునందన్ రోడ్డు సెయింట్ మార్క్స్, క్రిస్టియన్ కాలనీ సెంటినరీ వెస్లీ, సెయింట్ జాన్స్ స్కూల్ పక్కన గల లూర్దు మాత చర్చిల్లో ప్రార్థనలు, ప్రసంగా లు నిర్వహిం చనున్నారు.

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బైబిల్ పఠనాలు, ప్రార్థన గీతాలు, ప్రత్యేక ప్రార్థనలతో చర్చిల ప్రాంగణాలు మార్మోగనున్నాయి. ఆదివారం ఈస్టర్ సందర్భంగా ఉదయం నాలుగు గంటలకు ప్రార్థనలు జరుగనున్నాయి.



ఏర్పాట్లు చేస్తున్న సెంటినరీ వెస్లీ చర్చి

30 రోజుల్లో మ్యుటేషన్ దరఖాస్తుల పరిష్కారం

కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూ భారతి ద్వారా 30 రోజుల్లో భూమి మ్యుటేషన్ దరఖాస్తులను పరిష్కరిస్తామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం రూపకల్పన చేసిందని తెలిపారు. జిల్లాలో 30వ తేదీ వరకు ప్రతి మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. భూ భారతి చట్టంపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసిందని తెలిపారు. సీసీఎల్ఏకు వెళ్లే అవసరం లేకుండా జిల్లాస్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆర్డీవో, కలెక్టర్‌కు అధికారాలు కల్పించారని తెలిపారు. అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆర్డీవో నిర్ణయం సరైంది కాదని భావిస్తే కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు.

గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి ప్రదర్శిస్తామని, రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసు కుంటుందని తెలిపారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూధార్ సంఖ్య కేటాయింపునకు ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. ప్రస్తుతం ధరణిలో ఉన్న భూ రికార్డులు భూ భారతిలో కొనసాగు తాయిని, భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ దరఖాస్తులను పరిశీలించి ఆర్డీవో, కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. భూ భారతి పోర్టల్‌లో ఏకరం భూమి మ్యుటేషన్ కోసం 2,500 రూపాయల ఫీజు చెల్లించాలని, దరఖాస్తుతోపాటు వారసత్వ ఒప్పంద పత్రం లేదా విలునామా కాపీ, నిర్దేశించిన తేదీ నుంచి భూమి సర్వే పటం జత చేయాల్సి ఉంటుందన్నారు.

తహసీల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. గడువు తర్వాత ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ జరుగుతుందన్నారు. భూ భారతి చట్టంపై ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలిపింది. దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వ్యవసాయధికారి భాగ్యలక్ష్మి, తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● గన్నేరువరంలో..

గన్నేరువరం: భూ సమస్యల పూర్తి పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం మండల కేంద్రంలో భూ భారతి కొత్త ఆర్వోఆర్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు భూ భారతితో చట్టంతో పరిష్కారం కానున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధరణిలో రైతుల సమస్యల పరిష్కారానికి సరైన చట్టం లేకపోవడంతో వేలల్లో భూ సమస్యల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. తాను జిల్లాకు వచ్చినప్పటి నుంచి 11 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా మూడు వేల దరఖాస్తులను మాత్రమే పరిష్కరించామన్నారు. భూ భారతి ద్వారా కిందిస్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీంతో చిన్న సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దారు ఇప్ప నరేందర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో కిరణ్మయి, ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



తిమ్మాపూర్‌లోని రైతు వేదికలో భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఘర్షణకు దారితీసిన క్రికెట్ ఆట

● మాజీ కౌన్సిలర్‌తోపాటు కుమారుడిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఆట రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసిన సంఘటన సిరిసిల్లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లో ఇటీవల సెలవులు రావడంతో బాలలంతా కలిసి క్రికెట్ ఆడేందుకు క్రీడామైదానానికి వెళ్లారు. ఇందులో భాగంగా ఇరుజట్లు మైదానంలోకి క్రికెట్ ఆడేందుకు దిగాయి. ఇరువైపుల జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో భవన్ అనే బాలుడు రెండుసార్లు అవుట్ అయ్యాడు. దీంతో నన్నే అవుట్‌చేస్తావా, మా నాన్న రెండుసార్లు కౌన్సిలర్.. అంటూ ఆగ్రహంతో క్యాచ్‌పట్టిన భార్గవ్ అనే బాలుడిని బ్యాట్‌తో కొట్టాడు. దీంతో రెండు కుటుంబాల మధ్య వివాదానికి తెరలేపింది. క్రికెట్‌లో అవుట్ చేసిన బాలుడిపై దాడిచేయడంతో అతని స్నేహితులు వెంటనే అతని ఇంటికి వెళ్లి తల్లికి చెప్పారు. ఎందుకు కొట్టావంటూ బాలుడిని అడిగేందుకు వెళ్లిన తల్లిపై మాజీకౌన్సిలర్ దౌర్జన్యం చేయడమే కాకుండా దుర్భాషలా డారు. దీంతో బాధితురాలు అన్నల్‌దాస్ ఉష పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేసింది. ఈమేరకు మాజీకౌన్సిలర్ గుండ్లపల్లి పూర్ణచందర్, అతడి కుమారుడు భవన్‌పై అదేరోజు కేసు నమోదుచేశామని టౌన్ సీఐ కె కృష్ణ గురువారం తెలిపారు. ఇదిలా ఉంటే తమకు మాజీకౌన్సిలర్, అతని అనుచరులతో ప్రాణభయం ఉందని, ద్విచక్రవాహనాలతో తమ ఇంటిచుట్టూ చక్కర్లు కొడుతూ భయభ్రాంతులకు గురిచేస్తు న్నారని, తమకు రక్షణ కల్పించాలని బాలుడితల్లి ఉష వేడుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ విచారణ

మల్యాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై మండలంలోని ముత్యంపేటలో డీఎస్పీ రఘుచందర్ విచారణ జరిపారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్‌కు చెందిన తిప్పని కార్తిక్ అనే యువకుడు ముత్యంపేటకు చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తూ మంగళవారం యువతి ఇంటికి వచ్చి కులం పేరుతో దూషించాడు. దీంతో పోలీసులు బుధవారం యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. గురువారం డీఎస్పీ విచారణ జరిపి వివరాలు నమోదు చేసుకున్నారు. డీఎస్పీ వెంట ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

భక్తులతో అమర్యాదగా ప్రవర్తించడం సరికాదు

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం అధ్యక్షుడిగా తనకు తాను ప్రకటించుకున్న కార్యదర్శి సిరిమల్ల జయేందర్ భక్తులు, గురు స్వాములపట్ల అమర్యాదగా ప్రవర్తించడం సరికాదని భక్తులు గురువారం ఒక ప్రక టనలో ఆరోపించారు. లక్షలాది రూపా యలు చందాలు ఇచ్చిన భక్తులకు ఆలయంలో జరిగే ఉత్సవాలకు ఆహ్వానిం చకపోవడం బాధాకరం అన్నారు. ప్రశ్నిం చిన వారిని ఏదో విధంగా అవమాన పరుస్తూ ఆలయానికి రాకుండా చేస్తున్నా రని అయిత విజయ్‌కుమార్, గందె రాజు, యాద సతీష్, తదితరులు తెలిపారు.

వృద్ధులకు అండగా..

లయన్స్ క్లబ్ విజన్ కేర్ ఉచిత సేవలు

అవగాహన కల్పించి కంటి చికిత్సలు

10374 మందికి ఆపరేషన్లు, 63743 మందికి అద్దాలు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కంటి చూపు లోపంతో కొట్టుమిట్టాడుతున్న వృద్ధులకు మేమున్నామని అండగా నిలుస్తోంది లయన్స్ క్లబ్ విజన్ కేర్. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లా కు చెందిన 23 మంది నేత్రవైద్య సహాయకులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మొదటి విడుతలో తెలంగాణ కంటి వెలుగులో పని చేశారు. కంటి వెలుగు పథకం లేకపోవడంతో బాధితుల నుంచి నేత్ర వైద్య సహాయ కులకు పెద్ద ఎత్తున వినతులు వచ్చాయి. వీరికి కంటి చూపు కల్పించాలన్న భావన వారిలో వ్యక్త మైంది. నేత్ర వైద్య సహాయకులు వారిలో కంటిలో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320జీ వారిని సంప్రదించి పరిస్థితిని వివరించారు. వారు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

2021లో పూదరి దత్తాగౌడ్ నేతృత్వంలో లయన్స్ క్లబ్ విజన్ కేర్ స్థాపించారు.



కంటి ఆపరేషన్‌కు వెళ్తున్న బాధితులు

వ్యవస్థాపక అధ్యక్షుడిగా దత్తాగౌడ్ లాభాపేక్ష లేకుండా అడుగులు ముందుకు వేశారు. వచ్చిన వినతులను పరిశీలించి ఆయా గ్రామాలకు వెళ్ళి కంటి చికిత్సలు చేయించడం మొదలుపెట్టారు. లయన్స్ క్లబ్ సభ్యులు గ్రామాల్లో తిరుగుతూ కంటి చికిత్సలపై విసృత స్థాయిలో అవగా హన కల్పించి చికిత్సలు చేయించుకు నేందుకు ప్రోత్స హించారు. గ్రామాలతో పాటు పట్టణాల్లో ఉచితవైద్య శిబిరాలు నిర్వహించారు. ఇప్పటి వరకు 2లక్షల13 వేల 567 మందికి పరీక్షలు చేయించారు.

సుమారు 10 వేల 374 మందికి కంటి ఆపరేషన్లు చేయించారు. అద్దాలు, మందులు అందేలా చర్యలు తీసుకున్నారు. కంటి శస్త్ర చికిత్స అందించే వారితో పాటు వచ్చే సహా యకులకు ఉచిత రవాణా, భోజన వస తులు కల్పించారు. లయన్స్ కంటి ఆసుపత్రి రేకుర్తి, చల్మెడ ఆనంద రావు ఆసుపత్రి, బెల్లం పల్లి పుష్పగిరి కంటి ఆసుపత్రిల సహకా రంతో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిం చారు. ఈ ఆపరేషన్లకు డిస్ట్రిక్స్ బ్లైండ్నెస్ కంట్రోల్ సొసైటీ ద్వారా ఒక్కో ఆపరేషన్‌కు 2 వేల రూపాయలు చెల్లిస్తోంది. ఈ డబ్బులు రవాణా, భోజన సౌకర్యాల ఖర్చులకు సరిపో తుంది. ఒక్క ఆపరేషన్ బయట చేయించుకోవాలంటే సుమారు 20 వేల రూపాయలు ఖర్చు అవుతుందని వారు పేర్కొంటున్నారు. దాతల సహకారంతో 63 వేల 743 మందికి అద్దాలు అందజేశారు. ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి అవుట్ సోర్సింగ్ లేదా రెగ్యులర్ అసిస్టెంట్ అప్తామాలిక్ పోస్టులుగా గుర్తించి ఉపాధి కల్పిస్తే మరింత సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొంటున్నారు.

లయన్ సభ్యులు పూదరి దత్తాగౌడ్, అలీ అహ్మద్, పెర్క పృథ్వీ రాజ్, సయ్యద్ ఇలియాస్ పరకాల, దామ లావణ్య, ముబీన్, బొగే సాయి నిఖిల్, అబ్దుల్ వాసే, బోడ రమేష్, షాకీర్, ఆసిమ్, బుద్దార్తి సతీష్ కుమార్, ఆకుల మల్లేష్, మాదర్‌ఖాన్, అలీం లయన్స్ క్లబ్ విజన్ సెంటర్ల ద్వారా ఉచితంగా పరీక్షలు చేసి దాతల సహాయంతో ఆపరేషన్లు చేస్తూ అద్దాలు, మందులు అందజేస్తున్నారు.



పేద ప్రజలకు కంటివైద్యం అందించడమే లక్ష్యం

పూదరిదత్తాగౌడ్, లయన్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు



నిరుపేద ప్రజలకు కంటి వైద్యం అందించడమే లక్ష్యంగా లయన్ విజన్ కేర్ పని చేస్తుంది. ఇప్పటికి వరకు లక్షలాది మందికి పరీక్షలు చేసి వేల మందికి ఆపరేషన్లు చేసి అద్దాలు అందజేశాం.

5వేలకు పైగా ఆపరేషన్లు

చిదుర రమేష్, రేకుర్తి కంటి ఆస్పత్రి వైస్ చైర్మెన్



రేకుర్తి ఆస్పత్రిలో లయన్ విజన్ కేర్ ద్వారా 5 వేల మందికి పైగా ఆపరేషన్లు చేశాం. ప్రభుత్వం రోగు లకు ఇస్తున్న రెండువేల రూపా యలతో రవాణా, భోజన సౌకర్యం కల్పించాం. నెల రోజులకు సరిపడా మందులు అందజేశాం.

పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశారు

భూదమ్మ మంథని



పైసా ఖర్చు లేకుండా బస్సులో తీసుకెళ్ళి పరీక్షలు చేసి ఆపరేషన్ చేసి అద్దాలు, మందులు ఇచ్చారు. ఇప్పుడు కండ్లు మస్క లేకుండా కనిపిస్తున్నాయి,

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

● 23 మందికి గాయాలు

● డ్రైవర్ ఫోన్ మాట్లాడమే ప్రమాదానికి కారణం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం అప్పన్నపేట, అందుగులపల్లి మధ్య కరీం నగర్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదు రుగా వస్తున్న లారీని గురువారం సాయంత్రం ఢీకొం ది. పెద్దపల్లి మండలం అప్పన్నపేట అందుగులపల్లి మధ్యలో రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్‌ను వన్‌వేకు మళ్ళించారు. కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న పల్లె వెలుగు టీఎస్ 02 యూటీ 9326, కరీంనగర్ వైపు వెళ్తున్న బూడిద లారీ టీఎస్ 22 0450 ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సులో సుమారు 32మంది ప్రయాణికులున్నారు. ఈ సంఘట నలో 27మందికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108లో పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కండక్టర్ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రి తరలించినట్లు తెలిసింది. అయితే డ్రైవర్‌నాగేందర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు నడపడం వల్లే ఈప్రమాదం జరిగిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఆస్పత్రిఆవరణ క్షతగాత్రులతో నిండి పోయింది. గాయాలైన వారిలో ఎర్రగొండ పావని, కీర్తన, ఎర్రగొండ ప్రేమలత, కోండ్రరాధ, అగపెలిసా, చిరంజీవి, ఎనవాక మహాలక్ష్మీ, తన్వీశ్రీ, మోక్షశ్రీ, శారద, సహస్ర, కొయ్యడ సంపత్, కొయ్యడ రజిత, కీర్తన, సౌజన్య, శోభ, వొల్లెపురాజమ్మ, అనిల్‌కుమార్, కాంపెల్లి సుజాత, మడుపు అనిత, సరిత, మోక్షిత్, వైష్ణవి, దీపిక, మనోజ్, ఎరుకల శోభ,ఆశానె,సృజన ఉన్నారు.ప్రమాదం జరిగినవెంటనే ఏసీపీ గజ్జికృష్ణ, ఎస్సైలు సీఐ, సిబ్బం దిని పంపించి సహాయక చర్యలు చేపట్టారు.


ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, లారీ


గాయపడ్డ వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

● క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

గాయపడిన వారిని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రభుత్వాస్పత్రిలో పరా మర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశిం చారు. గాయ పడిన వారికి వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచిం చారు. ఆర్‌ఎం భూపతిరెడ్డి, గోదా వరిఖని డీఎం నాగభూషణం పరామర్శించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఫ్లెక్సీ వివాదం

● ప్రారంభోత్సవ సమయంలో తోపులాట ● పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు

గంభీరావుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రంవద్ద ఫ్లెక్సీవిషయమై వివాదం నెలకొంది. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేం దుకు మార్కెట్‌కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతితోపాటు పలువురు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన బీఆర్ ఎస్, బీజేపీ నేతలు ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ బండి సంజయ్ ఫొటోలు లేవని నిర్వాహకులను ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు మధ్య వాదోపవా దాలు పెరిగి, తోపులాటకు దారితీసింది. స్థానిక ఎస్ఐ ప్రేమానందం, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యం లోని పోలీస్‌సిబ్బంది జోక్యం చేసుకొని పరి స్థితిని అదుపులోకి తెచ్చారు. ఇదిలా ఉండగా తమ పార్టీ నాయ కులపై కాంగ్రెస్ నాయ కులు దాడిచేశారని సిరిసిల్ల నియోజకవర్గంలోని బీఆర్ ఎస్ ముఖ్యనేతలు గంభీరా వుపేట పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చారు. తమనాయ కులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కొనుగోలు కేంద్రం ప్రారంభాన్ని అడ్డు కుని, విధులకు ఆటంకం కలి గించారంటూ బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు సైతం ఫిర్యాదు చేశారు. రెండు పార్టీలనేతలు ఒకరిపై ఒకరు విమర్శిస్తూ పోలీస్‌స్టేషన్ వద్ద నినాదాలు చేసుకోవడంతో ఉద్రిక్తతగా మారింది.


కొనుగోలు కేంద్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

గంజాయి పట్టివేత

గంగాధరర,ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గట్టుబూత్కుర్‌లో గురువారం 68గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్ఐ వంశీక్రిష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గట్టుబూత్కుర్ గ్రామశివారు రైసుమిల్లులో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ముకేష్ వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారం మేరకు తనిఖీ చేయగా గంజాయి లభించినట్లు ఆయన తెలిపారు. 68గ్రామాలు గంజాయితో పట్టుబడిన ముకేష్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామంలోని మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఓనర్ ఈరవేణి శ్రీనివాస్, పూసల శంకర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య


శ్యామల (ఫైల్)

మానకొండూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన మార శ్యామల(38) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గంగిపల్లికి చెందిన యాదగిరితో 26ఏళ్ళ క్రితం శ్యామల వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె జన్మించగా కుమార్తెకు ఇటీవల అప్పుచేసి వివాహం జరిపించారు. తన భర్త యాదగిరి దుబాయి వెళ్లగా కొంతకాలంగా శ్యామల అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆసుపత్రులలో చూపించిన నయం కాలేదు. జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం రాత్రి ఇంటిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న భర్త యాదగిరి గురువారం స్వగ్రామానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శవపంచనామా నిర్వహించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి

కోరుట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పోందుతూ మల్లాపూర్ మండలం కుస్తాపూర్ గ్రామానికి చెందిన నీరేటి ముత్తయ్య (60) అనే వ్యక్తి మృతి చెందాడు. ముత్తన్న కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి డయాలసిస్ చేసుకోవడానికి గురువారం మధ్యాహ్నం వచ్చాడు. చికిత్స నిర్వహిస్తున్న సమయంలో ముత్తయ్య మృతి చెందాడు. ముత్తన్న మృతికి వైద్యులు కారణమంటూ మృతుడి బంధువులు నిలదీసారు. ముత్తన్న మృతిపై అనూమానం ఉందని ఆందోళనచేసేందుకు సిద్దంమయ్యారు. గమనించిన స్థానికులు కోరుట్ల పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలంకు చేరుకోన్న ఎస్ఐ శ్రీకాంత్ మృత్తన్న కుటుంబసభ్యులు, బంధువులను సముదాయించారు. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేయించి రిపోర్ట్ ఆదారంగా ఆసుపత్రి వర్గాలపై కేసునమోదు చేస్తామని తెలిపారు. కాగా ముత్తయ్య కుస్తాపూర్ గ్రామం నుంచి మధ్యాహం ద్విచక్ర వాహనంపై ఎండలో వచ్చాడని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ముత్తయ్య ఎండ వేడికి మృతి చెందాడో... లేక మరే ఇతర కారణంతో మృతి చెందాడన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్స్


జమ్మికుంటకు వెళ్లే మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మానకొండూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలోని రెండు మూలమలుపులు, రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లతో ప్రమాదం పొంచి ఉంది. తూర్పుదర్వాజ బస్టాండ్ మూలమలుపు వద్ద 20ఏళ్ల క్రితం అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కరీంనగర్ నుంచి జమ్మికుంట ప్రధానరహదారి మానకొండూర్ తూర్పుదర్వాజ బస్టాండ్ మీదుగా ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు నిత్యం వెళుతుంటాయి. కరీంనగర్ నుంచి జమ్మికుంట వైపు తిరిగే మూలమలుపు వద్ద గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. డ్రైవర్ ఆదమరిస్తే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనాల్సిందే. జమ్మికుంట వైపు వెళ్లే ప్రయాణికులు నిలబడడానికి అక్కడ స్థలమే లేదు. ప్రయాణికులు వేరే స్థలంలో ఉండి బస్సు వచ్చే సమయంలో పరుగులు తీసి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఇక్కడ అనేకప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాతపడ్డారు. ప్రస్తుతం ఇదే బస్టాండ్‌వద్ద జమ్మికుంట నుంచి కరీంనగర్ వెళ్లే మూలమలుపు వద్ద విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు గద్దెను నిర్మిస్తున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంపై గ్రామస్థులు, ప్రయాణికులు వ్యతిరేకిస్తున్నారు. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ గద్దె నిర్మాణం చేపట్టవద్దని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై మానకొండూర్ విద్యుత్ ఏఈ ఆర్ సత్య నారాయణను వివరణ కోరగా పాతట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు పడుతోందని స్థలం లేకపోవడంతోనే మూలమలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు


వెంకటాపూర్ వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేటలో పోలీసులు అక్రమ అరెస్ట్ చేసిన నాయకులకు సంఘీభావం తెలపడం కోసం వెళుతున్న ఎల్లారెడ్డిపేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిలను మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో గురువారం పోలీసులు అడ్డుకున్నారు. గంభీరావుపేటలో నెలకొన్న ప్రోటోకాల్ వివాదంలో బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని పేర్కొంటూ అక్కడి పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారనే సమాచారంతో బయలుదేరి వెళ్లారు. దాంతో వెంకటాపూర్ గ్రామ శివారులో నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. తమ నాయకులకు సంఘీభావం తెలిపేందుకు బయలుదేరితే పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని నాయకులు కృష్ణహరి, కృష్ణారెడ్డిలు పేర్కొన్నారు.

రైలు కింద పడి ఒకరి బలవన్మరణం

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని రైలుకింద పడి ఓ వృద్ధుడు గురువారం ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్ల వాడకు చెందిన పొట్టబత్తిని సురేందర్(69) ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గురువారం గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

నిజాం దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన 'సింగిరెడ్డి' కుటుంబం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నైజాం అరాచకాలు, దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కామ్రేడ్ సింగిరెడ్డి భూపతిరెడ్డి కుటుంబం నిలిచిందని సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటయోధుడు సింగిరెడ్డి భూపతి రెడ్డి కుమార్తె బద్దం సత్తవ్వ పది రోజుల క్రితం మృతిచెందగా గురువారం బాధిత కుటుంబ సభ్యులను చాడ వెంకటరెడ్డి, సీపీఐ నాయకులు పరామర్శించారు. బద్దం సత్తవ్వ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ఆనాడు నైజాం అరాచకాలు, దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అన్నబేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డిలు సాయుధ దళాల నిర్మాణంచేపట్టి నైజాం, జమిందారులు, భూస్వాము లకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటం దిక్కు నడిపించారని గుర్తుచేశారు. ఆ పోరాటానికి సింగిరెడ్డి భూపతిరెడ్డి కుటుంబం మొత్తం ఉద్యమానికి మద్ద తును తెలియజేస్తూ నిజాం పోలీసుల దాడులను నిత్యం ఎదుర్కొంటూ ఇంటికి వచ్చిన దళాలు, దళనాయకులకు సహాయసహకారాలు అందించి ఉద్యమాన్ని కాపాడారన్నారు. పోలీసులు, నైజాంసర్కార్ దాడులకు వ్యతిరేకంగా నిలబడి చివరి వరకు ఎర్రజెండా పోరాటస్మృతులను, సింగిరెడ్డి భూపతిరెడ్డిచేసిన త్యాగాలను స్మరించుకుంటూ తండ్రి ఆశయాలకు అనుగుణంగా బద్దం సత్తవ్వ ముందుకు సాగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి గుంటివేణు, జిల్లా కార్యవర్గసభ్యులు మంద సుదర్శన్, మీసం లక్ష్మణ్, కడారి రాములు, అజ్జువేణు, సోమనాగ రాజు, మంత్రి చంద్రయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్రరాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, నాయకులు

రెండు ఇళ్లలో చోరీ


విచారణ చేపట్టిన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య

చందుర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో బుధ వారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులకథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిర్రం రాజవ్వ, వెంగళ వినోద ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. చిర్రం రాజవ్వ ఇంటికి తాళంవేసి తన కుమారుడి ఇంటికి నిద్రిం చేందుకు వెళ్లింది. ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.15వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు తెలిపింది. ప్రశాంత్ అనే పాస్టర్ తన ఇంటిముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వినోద 25రోజులక్రితం హైదరాబాద్ వెళ్లి నందున వివరాలు తెలియవలసి ఉన్నది. ఈ సంఘటనపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య విచారణ చేపట్టారు.

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): భారతదేశం చారిత్రక, పౌరాణిక, ఇతిహాసిక, సాంస్కృతిక, నైతిక వారసత్వానికి వాసి గాంచిన నేల. దేశంలో ఎన్నో కట్టడాలు, చరిత్రలు, స్థలాలు, వస్తువులు మన దేశ, ప్రాంత వైభవాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నాయి. ఒక్కో రాష్ట్రానికి, జిల్లాకు ప్రత్యేక చరిత్ర, సంస్కృతి, శిల్ప సంపద ఉండగా అవన్నీ మనల్ని మంత్రముగ్ధుల్ని చేసి మరపురాని మధుర జ్ఞాపకాలుగా నిలుపుతాయి. ప్రతీ యేటా ఏప్రిల్ 18న అంతర్జాతీయ చారిత్రక కట్టడాల దినోత్సవంగా (ప్రపంచ వారసత్వ దినోత్సవం, వరల్డ్ హెరిటేజ్ డే) జరుపుకుంటారు. ఐక్య రాజ్య సమితిలోని సభ్య దేశాలు, అంతర్జాతీయ పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో వారసత్వ సంపద పరిరక్షణకు ఒకరికొకరు పలు అంశాలతో పరస్పరం సహకరించుకోవాలని ఆఫ్రికాలోని ట్యూనీషియాలో 1982, ఏప్రిల్ 18న సమావేశంలో ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రతిపాదనను యునెస్కోకు పంపగా ఏప్రిల్ 18ని ప్రపంచ వారసత్వ దినోత్సవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి వారసత్వ సంపద ప్రాధాన్యం తెలిపేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 800 పురాతన కట్టడాలు, స్థలాలను గుర్తించి పరిశీలన జరుపుతున్నారు.


ఎలంగందుల ఖిల్లా

ఘనమైన వారసత్వ సంపద

- పట్టించుకోక శిథిలావస్థకు..
- దెబ్బతింటున్న పలు కట్టడాలు
- నేడు ప్రపంచ వారసత్వ దినోత్సవం

ఉమ్మడి జిల్లాలో పలు కట్టడాలు

ఉమ్మడి జిల్లాలో పురాతత్వ వారసత్వ కట్టడాలు సుమారు 150 వరకు ఉండగా అందులో పురాతత్వ శాఖ గుర్తించిన ప్రదేశాలు, కట్టడాలు 50 నుంచి 60 వరకు ఉన్నాయి. 1850 నుంచి 1950 వరకు వివిధ ప్రదేశాలు, గ్రామాల్లో కట్టిన 350 బురుజులు ఉన్నాయి. మౌర్యులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, బాదామీ చాళుక్యులు, పశ్చిమ చాళుక్యులు, కాకతీయులు, వేములవాడ చాళుక్యులు, పొలవాస, విజయనగర రాజులు ఈ జిల్లా ప్రాంతానికి వచ్చినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అనంతరం బహమనీయులు, మొఘలాయీలు, కుత్‌బు షాహీలు, అసబ్‌జాయీలు వంటి ముస్లిం రాజులు ఈ నేలపై కాలు మోపారు. విస్తారమైన గోదావరి, మానేరు వంటి నదీతీరాలు వెలియడంతో మన కట్టడాల చరిత్ర మరింత విలసిల్లింది. కోటలు, ఆలయాలు, మసీదులు, చర్చిలు, రాజులు, మంత్రులు, జమీందారుల స్థావరాలు ప్రాచీన చరిత్రకు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. ధూళికట్ట బౌద్ధ స్తూపం అమరావతి స్తూపం కంటే పురాతనమైనదిగా చెబుతారు. అది ప్రస్తుతం హీన దశకు చేరుకుంటోంది. జగిత్యాల, ఎలగందుల, మొలంగూరు లాంటి కోటలు శిథిలమవుతున్నాయి. ఐదు కోట్ల వ్యయంతో అప్పటి కేంద్ర మంత్రి చిరంజీవి, ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎలగందుల ఖిల్లాలో సౌండ్, లైటింగ్ షో ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలు అనంతరం అది మూలన పడింది.


వేమువాడలోని భీమేశ్వరాలయంలోని జైన విగ్రహాలు

కోటి లింగాలలో తొలి శాతవాహన స్థావరం


కోటి లింగాలలో తొలి శాతవాహన స్థావరం 1975లో బయట పడగా గోదావరి నీరు ముంపునకు గురి కాకుండా రక్షణ గోడ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. చారిత్రక నేపథ్యం ఉన్న పొలాస ఆలయాలు శిథిలమవుతున్నాయి. వేములవాడ భీమేశ్వర ఆలయంలో సప్తమాతృకలు, లింగాలు, జైన విగ్రహాలు కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. సుమారు 1700 సంవత్సరాల కేదారీశ్వర ఆలయం, నగరేశ్వర దేవాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. కరీంనగర్ పాతబజార్ గౌరీశంకరాలయంలో రెండు జైన విగ్రహాలుండగా ఒకటి ధ్వంసం కాగా మరొకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. వేములవాడ చాళుక్యుల కాలం నాటి సిరిసిల్ల ఎల్లారెడ్డిపేట సమీపంలోపి మూలవాగు పుట్టిన భీముని మల్లారెడ్డిపేట సీతారామ, ఆంజనేయ స్వామి ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. గోదావరి తీరంలోని మంథనిలో 25 ఆలయాలుండగా గౌతమేశ్వర స్వామి దేవాలయం కాకతీయుల కాలం నాటిది. నగునూరు, కొత్తపల్లి, బొమ్మలమ్మ గుట్ట దేవాలయాలు కూడా అభివృద్ధికి నోచుకోవాల్సిన అవసరం ఉంది. 1905లో ఎలందుల నుంచి కరీంనగర్‌కు జిల్లా తరలివచ్చిందని చెబుతారు. జిల్లా పర్యాటక అధికారిగా ఏడాదిగా ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారు

ఆదరణకు నోచుకోని కరీంనగర్ మ్యూజియం

కరీంనగర్‌లో అర్థ శతాబ్దం క్రితం ఏర్పాటు చేసిన ప్రభుత్వ పురావస్తుశాఖ మ్యూజియం ఆదరణకు నోచుకోవడం లేదు. పట్టించుకునే వారు లేక శిథిలా వస్థకు చేరుకుంది. గోడలకు రంధ్రాలు ఉండడంతో విలువైన విగ్రహాలు, ఇతర వస్తువులకు భద్రత కరువైంది. పురావస్తు శాఖలో నిధు లు, సిబ్బంది కొరతతో ఈ మ్యూజి యం, కార్యాలయాల నిర్వహణ భారంగా మారింది. మ్యూజియం లోని ప్రదర్శనశాలలో ఇత్తడి, ఆదిమ జాతుల కాలం నాటి పాతరాతి యుగం ఆనవాళ్ళు, ప్రముఖ చరిత్రకారుడు ఠాకూర్ రాజారాంసింగ్ భద్రాచలం నుంచి బాసర వరకు తిరిగి సేకరించిన ఆదిమ మానవులు వాడిన రాతి పని ముట్లు, రెండు వేల సంవత్సరాల చరిత్ర గల శాతవాహనుల కాలం నాటి కోటి లింగాల బౌద్ధ స్తూప ఖండికలు ఉన్నాయి.


కరీంనగర్‌లోని మ్యూజియం


జగిత్యాల కోట


మొలంగూర్ ఖిల్లా


ఎలంగందుల ఖిల్లాలో మినార్లు

ఐఆర్‌సీటీసీ సమ్మర్ ప్యాకేజీ

- హైదరాబాద్ నుంచి భారత్ గౌరవ్ రైలు యాత్ర
- జనరల్ మేనేజర్ టూరిజం డీఎస్‌జీపీ కిషోర్



పెద్దపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి భారత్ గౌరవ్ రైలు యాత్ర సమ్మర్ స్పెషల్ ప్యాకేజీ అందుబాటులో ఉన్నాయని ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ టూరిజం డీఎస్‌జీపీ కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ ద్వారా ఐఆర్‌సీటీసీ భారత గౌరవ టూర్ పేరుతో ప్రత్యేకంగా దేశంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను హైదరాబాద్ నుంచి ప్యాకేజీలు తయారు చేసిందని, వీటిలో ట్రైన్, బస్ జర్నీ, హోటల్, భోజన ఖర్చులు, గైడ్‌తో సహ సైట్ సీయింగ్ ఉంటాయని పేర్కొన్నారు. భార త గౌరవ టూర్‌లో భాగంగా హైదరాబాద్ నుంచి ఐదు ప్యాకేజీలలో ప్రత్యేక రైళ్లు ఉన్నాయని తెలిపారు.

- ఈనెల 23 నుంచి మే 2 వరకు 9 రాత్రులు, 10 రోజులలో హరిద్వార్, రిషికేష్ వైష్ణవ దేవి, ఆనంద్‌పూర్, నైనాదేవి, అమృత్‌సర్ పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. ప్రతీ ఒక్కరికి 18,150 రూపాయల ఖర్చు అవుతుంది.
- మే 8 నుంచి 17 వరకు 9 రాత్రులు, 10 రోజులలో వారణాసి, పూరి, గయా, అయోధ్య, ప్రయాగ్ రాజ్, కోణార్క్ పర్యాటక ప్రాంతాలను కవర్ కానుండగా, ఒక్కరికి 16,800 రూపాయల ఖర్చు అవుతుంది.
- మే 22 నుంచి 30 వరకు 8 రాత్రులు, 9 రోజులలో అరుణాచలం, రామేశ్వరం, తంజావూర్, కన్యాకుమారి, త్రివేండ్రం, త్రిచి, మధురై పర్యాటక ప్రాంతాలు కవర్ కానుండగా, ఒక్కరికి రూ.14,700 ఖర్చు అవుతుంది.
- జూన్ 4 నుంచి 12 వరకు 8 రాత్రులు, 9 రోజులలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోహం, నాగ్‌పూర్ పర్యాటక ప్రాంతాలు కవర్ కానుండగా, ఒక్కరికి 14,700 రూపాయల ఖర్చు అవుతుంది.

భారత గౌరవ టూర్‌లో పాల్గొనే వారు www.irctctourism.com వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా సికింద్రాబాద్ రోడ్డులోని ఐఆర్‌సిటిసి, మూడవ ఫ్లోర్, ఆక్స్‌ఫర్డ్ ప్లాజా, సికింద్రాబాద్‌లో బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 04027702407, 9701360701, 9281495845, 9281495843, 9281030750, 9281030740 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

నీరుకుళ్ల రంగనాయక స్వామి రథోత్సవం

సుల్తానాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల మానేటి రంగనాయక స్వామి రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం ముఖ్యమైనదిగా భావిస్తారు. ఈఓ శంకర్ ఆధ్వర్యంలో భక్తి గీతాలు, సంకీర్తనలు ఆలపించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. రథోత్సవంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సతీష్, పెద్దన్న శంకర్, అర్చకులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, రాజ్ కమారాచార్యులు, మాజీ సర్పంచ్ విజేందర్, పెరుమారెడ్డి పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎస్సారార్‌లో షార్ట్ టర్మ్ బ్యూటీషియన్ కోర్సు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాలలో షార్ట్ బ్యూటీషియన్ కోర్సు అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సుతో వచ్చే సర్టిఫికెట్ ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. 25 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

మహిళా హక్కుల పరిరక్షణే లక్ష్యం

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి


మహిళా హక్కుల పరిరక్షణ యాత్రలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మహిళా హక్కుల పరిరక్షణే లక్ష్యంగా, అంబేద్కర్, పూలే ఆశయాల సాధన దిశగా ఐద్వా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేపట్టినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర గురువారం కరీంనగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ చౌక్ వద్ద ఐద్వా కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మల్లు లక్ష్మి మాట్లాడారు. అంబేద్కర్, జ్యోతిబాపూలే ఆశయాల సాధన, మహిళా హక్కుల పరిరక్షణ కోసం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం కృషి చేస్తుందన్నారు. మహిళలపై అగాయిత్యాలు జరగకుండా చట్టాలు కఠినతరం చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరిరక్షణ యాత్రకు, రైతు సంఘం మాజీ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం, రైతు సంఘం అధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సాగర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.తిరుపతి, నరేష్ పటేల్ సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణ జ్యోతి, రాష్ట్ర సహా య కార్యదర్శి కేఎస్ ఆశలత, నల్లిగంటి రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు

- భీమన్న ఆలయంలో భక్తులకు దర్శనం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణ పనులు జూన్ మాసంలో ప్రారంభించనున్న సందర్భంగా భక్తులకు అనుబంధ ఆలయ మైన భీమేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవదాయశాఖ కమిషనర్ శ్రీధర్, వీటీడీఏ వైస్‌చైర్మన్, సెక్రెటరీ, కలెక్టర్ సందీప్ కుమార్‌లతో కలిసి గురువారం రాజన్న ఆలయాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయం ప్రాంగణం, ఆవరణ, ఆలయం ముందు భాగంతో పాటుగా శ్రీభీమేశ్వర స్వామివారి ఆలయాన్ని క్షేత్ర స్థాయిలో ఆలయ అభివృద్ధి నమూనాలతోపాటు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వేముల వాడ దేవాలయ అభివృద్ధికి రూ.38 కోట్లు ప్రకటించారన్నారు. ఆగమ శాస్త్రం, వాస్తు అంశాలను దృష్టిలో పెటుకుని భక్తులకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని కార్యాచరణ రూ పొందిస్తున్నామన్నారు.


ఆలయ ప్రాంగణంలో ఆది శ్రీనివాస్, శైలజరామయ్యర్

శృంగేరి పీఠం అనుమతితో పనులు ప్రారంభిస్తాం

- శైలజరామయ్యార్

వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.76 కోట్లు, అన్నదాన సత్రానికి రూ.35 కోట్లు, రోడ్డు వెడల్పు పనులకు రూ.47 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. దేవాలయ అభివృద్ధితో పాటుగా పట్టణ అభివృద్ధి సమాంతరంగా జరగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. అన్న దాన సత్రం నిర్మాణ పనులకు టెండర్ పూర్తి చేశామని తెలిపారు. శృంగేరి పీఠాధిపతుల అనుమతి, ఆశీర్వాదం తీసుకుని ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో స్థపతి వల్లినాయగం, ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, ఈవో వినోద్‌రెడ్డి, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, ఆర్‌అం డ్‌బీ సీఈ బిల్డింగ్స్ రాజేశ్వర్‌రెడ్డి, సీఈ ఎలక్ట్రికల్ లింగారెడ్డి, ఎస్ఈ లక్ష్మణ్, జిల్లా ఈఈ వెంకట రమ ణయ్య, ప్రధాన అర్చకులు ఉమేష్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నమిలికొండ రాజేశ్వరశర్మ, శరత్‌శర్మ పాల్గొన్నారు.

రాజన్న సేవలో..

రాజన్న ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా సందర్శనకు వచ్చిన దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవదాయశాఖ కమిషనర్ శ్రీధర్, వీటీడీఏ వైస్ చైర్మన్, సెక్రెటరీ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాలకు స్వాగతం పలికారు.

రాజన్న ఆలయాభివృద్ధిపై సమీక్ష

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధిపై దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వివిధ శాఖల అధికారులతో కలిసి ఆలయ గెస్ట్‌హౌస్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అవసరమైన మార్గదర్శకాలు, అనుమతుల కోసం ఈ నెల 27వ తేదీన శృంగేరి పీఠం వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.76 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు భూసేకరణ పెండింగ్ లేదని, ఆలయ నిర్మాణ పనుల మానిటరింగ్ కమిటీని జూన్ నెలలో ఏర్పాటు చేయాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ధార్మిక సలహాదారులు గోవిందహరి, స్థపతి వల్లినాయగం, ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, ఈవో వినోద్, ఈఈ రాజేష్, డీఈ రఘు నందన్, ఆర్‌అండ్‌బీ అధికారులు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి, లక్ష్మణ్, వెంకట రమణయ్య, ప్రధాన అర్చకులు ఉమేష్‌శర్మ తదితరులు ఉన్నారు.


పొలం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

పంటచేనుపై మూడో కన్ను

- పొలం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసిన రైతు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దొంగలు పెట్రేగిపోతున్నారు. ఇళ్లు, ఆలయాలే కాకుండా వ్యవసాయ పొలాల వద్ద తమ చేతులకు పని చెబుతున్నారు. వ్యవసాయ సామగ్రిని కాపాడుకునేందుకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతు గన్న బాల్‌రెడ్డి దుమాల గ్రామశివారులోని తనకున్న పొలం వద్ద రూ.5వేలు వెచ్చించి విద్యుత్ స్తంభానికి సీసీ కెమెరా బిగించాడు. వర్షానికి తడవకుండా ఉండడంతో పాటు ఎవరికీ అనుమానం కలగకుండా కరెంటు స్తంభంపై ఓ ఖాళీ డబ్బాను సగం వరకు తొలగించి అందులో సీసీ కెమెరా ఏర్పాటు చేశాడు. గతంలో పొలం వద్ద నుంచి ఎరువుల సంచులు, పైపులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు రైతు బాల్‌రెడ్డి పేర్కొన్నాడు. సీసీ కెమెరాను బిగించడంతో చోరీలు తగ్గాయని చెబుతున్నాడు.

దాహం తీర్చని 'మిషన్ భగీరథ'

- గ్రామాల్లో పూర్తి కానీ పైప్ లైన్ పనులు
- పట్టించుకోని అధికారులు


జాగీర్‌పల్లిలో నీరు రాక నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ నల్లా

సైదాపూర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి మంచి నీరు ఇవ్వాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ప్రవేశ పెట్టింది. అధికారుల నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ నీరు ప్రజల దాహార్తిని తీర్చలేకపోతోంది. సైదాపూర్ మండలంలో ఏ గ్రామానికీ పూర్తి స్థాయిలో మిషన్ భగీరథ నీరు అందడం లేదు. వేసవి కాలం సమీపించడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి ఏర్పడే అవకాశముంది. మండలంలో ఏ గ్రామంలోనూ పూర్తి స్థాయిలో మిషన్ భగీరథ పనులు పూర్తి కాలేదు. కొన్ని గ్రామాల్లో ఇంటింటికి పైపులు వేసి నల్లాలు ఏర్పాటు చేశారు. కానీ ఆ పైప్‌లైన్ కు నీటి కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో ఇంటి ముందు పేరుకే మిషన్ భగీరథ నల్ల ఉంది కానీ నీరు రావడం లేదని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ బావుల నుంచి నీటి సరఫరా

సైదాపూర్ మండలం మెట్ట ప్రాంతం కావడం, చాలా రోజుల నుంచి వర్షాలు పడక పోవడం, ఎండలు ముదిరి ఉష్ణోగ్రతలు పెరగడంతో భుగర్భ జలాలు అడుగంటాయి. దీంతో గ్రామాల్లో నీటి ఎద్దడి ప్రారంభమైంది. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఆయా గ్రామా పంచాయతీల ఆధ్వర్యంలో ప్రైవేట్ వ్యవసాయ బావుల నుంచి నీటిని కొనుగోలు చేసి గ్రామంలోకి సరఫరా చేస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు సరఫరా చేసి ప్రతీ ఇంటికి నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నీళ్లు రావడం లేదు

రాధారపు పద్మ, జాగీర్‌పల్లి



మిషన్ భగీరథ నీళ్ల వస్తాయని ఇంటి ముందు నల్లా పెట్టి ఐదేళ్ల గడిచాయి. ఇప్పటి వరకు ఒక్క బొట్టు నీళ్ల రాలే దు. పెద్ద సార్లు మాకు మిషన్ భగీరథ నీళ్ల వచ్చేలా చూడాలి.


వృథాగా మిషన్ భగీరథ నల్లా పైపు

సర్వాయిపేటలో గ్రామ పంచాయతీ కొనుగోలు చేసిన వ్యవసాయ బావి నుంచి నల్లాల బావికి పైపుల ద్వారా నింపుతున్న నీరు

● న్యూస్‌బాక్స్

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలను విజయవంతం చేయండి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పట్టణంలో నిర్వహించనున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం ఎస్‌యూ కార్యదర్శి ఇందూరి రాకేశ్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 27 వరకు సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మహాసభల్లో యూనివర్సిటీలోని సమస్యలపైన చర్చించనున్నామన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి రూ.200 కోట్లతో ప్రత్యేక బడ్జెట్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ శాతవాహన యూనివర్సిటీ ఉపాధ్యక్షులు వసంత్, శివ, దీక్షిత్, సందీప్ నాగరాజు, కిరణ్, సందీప్ పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో ప్రీ స్కూల్ మేళా

భగత్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పోషణ పక్షంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, ఏఎన్‌ఎం అరుణ, సరస్వతి పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని యశోద మెడికల్ సెంటర్‌లో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సెంటర్ హెడ్ రాజేందర్‌రావు తెలిపారు. దీర్ఘకాలిక జీర్ణకోశ, కాలేయ, కామెర్లు, లివర్ గడ్డలు తదితరాలకు సంబంధించి సర్జికల్ గ్యాస్ట్రోఎంటిరాలజిస్టు, రోబోటిక్ సర్జన్ డాక్టర్ మూడే జయంత్, మెదడు, వెన్నెముక, నరాల వ్యాధులకు సంబంధించి న్యూరో సర్జన్ డాక్టర్ అనంత్ ఈగూర్ పాల్గొంటారని తెలిపారు.

మెడికవర్ ఆధ్వర్యంలో..

సుభాష్ నగర్: నగరంలోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వ ర్యంలో గురువారం స్థానిక నెక్సా షోరూములో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ నగర మహాసభ

భగత్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సీపీఐ నగర 11వ మహాసభను శుక్రవారం నిర్వహించనున్నట్లు పార్టీ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు తెలిపారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మహాసభ ప్రారంభమవుతుందన్నారు. మహాసభకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి హాజరుకానున్నట్లు వెల్లడించారు. నగర ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

డిజిటల్ బోధనతో అవగాహన సులభం

● కలెక్టర్ పమేలా సత్పతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ బోధనతో విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన సులభతరమవుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్‌లోని కాశ్మీర్‌గడ్డ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్మార్ట్ డిజిటల్ తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు మెళకువలతో పాఠాలను బోధించాలని సూచించారు. ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డీఈవో జనార్దన్ రావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయిని హసీనా ఫాతిమా పాల్గొన్నారు.

తిమ్మాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటాపాటలతో కూడిన పూర్వ ప్రాథమికవిద్య బోధిస్తున్నామని, వచ్చే విద్యాసంవత్సరంలో ఆరేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఐసీడీఎస్, కరీంనగర్‌రూరల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యకు ఉపయోగించే బోధన ఉపకరణాలను మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో ప్రదర్శించారు. అనంతరం చిన్నారులకు కలెక్టర్ సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లా సంక్షేమ అధికారి సబిత, సీడీపీవో శ్రీమతి, ప్రాంగణం మేనేజర్ సుధారాణి, డీసీపీవో పర్వీన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రెప్యూటెడ్ జూనియర్ కళాశాలల స్కీం కింద 2025-26 విద్యా సంవత్సరానికి ఎస్సీఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించేందుకు ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, ఉపసంచాలకులు పవన్‌కుమార్ తెలిపారు. రెసిడెన్సియల్ వసతి, విద్యాబోధనలో ఉన్నత ప్రమాణాలు, కాంపిటేటివ్ పరీక్షల్లో ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణత శాతం ఉన్న రెప్యూటెడ్ జూనియర్ కళాశాలల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మే 1వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఉపసంచాలకులు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, కరీంనగర్‌లో సమర్పించాలని సూచించారు.

జిల్లా న్యాయమూర్తులకు ఘనంగా వీడ్కోలు



న్యాయమూర్తులను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కరీంనగర్ లీగల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన జిల్లా జడ్జి బి.ప్రతిమ, ఏసీబీ కోర్టు జడ్జి కుమార్ వివేక్, ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మికుమారిని కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. న్యాయ సేవాసదన్ భవనంలో నిర్వహించిన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న జిల్లా జడ్జి ప్రతిమ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాకు ఎంతో గుర్తింపు ఉందన్నారు. కేసుల పరిష్కారంలో న్యాయమూర్తులకు పూర్తి సహకారాన్ని అందించాలని న్యాయవాదులకు సూచించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, సీనియర్ న్యాయవాదులు డి.మల్లయ్య, పి.సజన్‌కుమార్, సంజీవ రెడ్డి, కొరివి వేణుగోపాల్, బాస సత్యనారాయణ, కుసుంబ కృష్ణరావు బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తుల సేవలను వివరించారు. న్యాయ మూర్తులు వెంకటేష్, నీరజ, శ్రీలేఖ, వాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేష్, మెజిస్ట్రేట్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆరెల్లి రాములు, కుమార్, గౌరు రాజిరెడ్డి, ఏజీపీ రమేష్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ అసోసియేషన్, ఉపాధ్యక్షుడు చందా రమేష్, సంయుక్త కార్యదర్శి సిరికొండ శ్రీధర్, కోశాధికారి సంపత్, మహిళా ప్రతినిధి రజిని పాల్గొన్నారు.

నీరు సరఫరా చేయకున్నా రికార్డుల్లో నమోదు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సుమారు ఆరేళ్లుగా ఇరుకుల్లకు నీటి సరఫరా చేయకున్నా చేసినట్టు రికార్డుల్లో నమోదు చేశారని గ్రామస్థులు మిషన్ భగీరథ అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం కరీంనగర్ మండలం ఇరుకుల్లలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై గ్రామసభ నిర్వహించారు. మొదట అధికారులు మాట్లాడుతూ ఆరేళ్లుగా ఇరుకుల్ల గ్రామానికి 1,60,000 లీటర్ల నీటిని సరఫరా చేసినట్టుగా రికార్డులో నమోదైనట్లు, ప్రతీ వేయి లీటర్లకు 160 రూపాయల చొప్పున ప్రభుత్వం చెల్లించినట్లు అధికారులు సభలో ప్రకటించారు. ఆరేళ్లపాటు కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజురయ్యాయన్నారు. దీంతో గ్రామస్థులు మాట్లాడుతూ మిషన్ భగీరథ ప్రారంభించిన కొత్తలో కలుషిత నీరు రావడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. కొత్తలైన్ ద్వారా నీటిని సరఫరా చేయాలని కొందరు, పాత లైన్ ద్వారానే అందించాలని మరికొందరు కోరడంతో సరఫరా పెండింగ్‌లోనే ఉందన్నారు. తప్పుడు బిల్లులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ ఈఈ అంజని రావు, డీఈ శ్రీనివాస్, ఏఈ వినయ్ సాయి, డీటీ వైశాలి, డీఈ, ఏఈ సయ్యద్ అజ్మోద్దీన్, ఎంపీవో జగన్‌మోహన్ రెడ్డి, కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గానికి సన్మానం



బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజును సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. కాంగ్రెస్ లీగల్ సెల్ స్టేట్ జాయింట్ కన్వీనర్ భూక్య రజనీష్, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ కల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ బార్ అసోసియేషన్ ఎన్నికల వివరాలను తెలుసుకున్నారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా కన్వీనర్లు కొత్తకొండ శంకర్, ఎంఏ నవాజ్, లింగంపల్లి శ్రీకాంత్, జాయింట్ కన్వీనర్లు బొడ్డు రాజు, ఐతు సృజన్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చెంద రమేష్, జాయింట్ సెక్రెటరీ సిరికొండ శ్రీధర్‌రావు, సీనియర్ ఈసీ మెంబర్ గుంటి మధు, జూనియర్ ఈసీ మెంబర్ ఏనుగుల సంతోష్ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి ఎదుట కార్మికుల ధర్నా

సుభాష్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఆసుపత్రి ఎదుట కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండారు శేఖర్ మాట్లాడుతూ పది శాతం కమీషన్ ఇస్తేనే కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేస్తారా? అని ప్రశ్నించారు. కార్మికులకు సంబంధించిన మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కామర్స్‌తో ఉద్యోగ అవకాశాలు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మంచి విషయ పరిజ్ఞానం, నైపుణ్యంతో బీకాం విద్యార్థులు వ్యాపార, వాణిజ్య పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని హనుమకొండలోని పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాల కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గుగులోత్ రాజు అన్నారు. ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ అటనామస్ కళాశాలలోని కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 'కామర్స్ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భారత్ ఒకటన్నారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ పాల్గొన్నారు.

దత్తతపై ఆసక్తి..

(5వ పేజీ తరువాయి)

-వివాహ ధ్రువీకరణపత్రం (సబ్‌రిజిస్ట్రార్ జారీచేసినది), ఆరోగ్య ధ్రువపత్రాలు, పోలీసుస్టేషన్ నుంచి క్లియరెన్స్, ఇద్దరు వ్యక్తుల సిఫారసు లెటర్లు (వారి గుర్తింపుకార్డుతోసహ)

-ఆస్తుల వివరాల పత్రాలు (వ్యవసాయ, నివాస, స్థలాల పట్టాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్స్, జీవితబీమా పత్రాలు)

-ఒంటరి వ్యక్తి అయితే విడాకుల డిక్రీ/భర్త లేదా భార్య మరణ ధ్రువపత్రం, బంధువుల ష్యూరిటీ సమర్పించాలి

- స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ-కరీంనగర్ పేరిట రూ.6 వేల డీడీ తీయాలి.

- సంబంధిత వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలి. అనంతరం ధ్రువపత్రాలు జతపరిచిన ఒరిజినల్ ఒక సెట్, జిరాక్స్ ఒక సెట్ ఆఫీస్‌లో అందజేయాలి.

- పాప లేక బాబును దత్తత తీసుకునే రోజున 50 వేల రూపాయల డీడీని సంబంధిత అడాప్షన్ ఏజెన్సీకి అందజేయాలి.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు సంఘం అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, దుర్శేడ్ సహకార సంఘం అధ్యక్షుడు తోట తిరుపతి గురువారం ప్రకటనలో తెలిపారు. దుర్శేడ్ సహకార సంఘం ఆధ్వర్యంలో దుర్శేడ్, మొగ్దుంపూర్, కరీంనగర్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చెర్లబూత్కూర్, నగునూర్‌లో ప్రారంభించనున్నామని, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

సెయింట్ జార్జ్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం



సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

భగత్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సీబీఎస్‌ఈ)లో వంద శాతం హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులను నిసోస్ బ్లాక్ సీబీఎస్‌ఈ విద్యానగర్ బ్రాంచ్‌లో సన్మానించారు. గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎలిజబెత్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

అచీవర్స్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కోతి రాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలలో గురువారం ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ నుంచి ప్రైమరీకి విద్యార్థులు ప్రమోట్ అవుతున్న సందర్భంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించినట్లు చెప్పారు. అంతకుముందు విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎలగందల్‌లో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

భగత్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ గ్రామంలో కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కొత్తపల్లి మండల కో-ఆర్డినేటర్ సత్యప్రసన్న, పార్టీ మండల అధ్యక్షుడు పంజాల స్వామిగౌడ్, ఆరె మల్లేశం నాయకులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో వీడ్కోలు వేడుక

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో గురువారం డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థినుల వీడ్కోలు వేడుకలను కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాలతి మాట్లాడుతూ విద్యార్థినులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని, భవిష్యత్‌లో రాణించాలని అన్నారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సమత, సీనియర్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభ కాంగ్రెస్ పతనానికి నాంది కావాలి



హుజూరాబాద్‌లో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో ఈ నెల27నజరిగే కేసీఆర్‌సభ కాంగ్రెస్ పతనానికి నాంది కావాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి సుమారు లక్షమందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

ధాన్యం దళారులకు అమ్మి నష్టపోవద్దు..

జమ్మికుంట: రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణం లోని పాత వ్యవసాయ మార్కెట్‌లో సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళారులు రైతులను మోసం చేయా లని చూస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న, వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ మామిడి తిరుపతిరెడ్డి, తహసీల్దార్ రమేష్, పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అండగా కాంగ్రెస్‌పార్టీ పనిచేస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ వొడితెలప్రణవ్ అన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 183మంది లబ్ధిదారులకు రూ.76లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మేకల తిరుపతి, మిడిదొడ్డి రాజు, కిరణ్, పుష్పలత పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

హుజూరాబాద్: పట్టణంలో విద్యాసంవత్సరం ముగియకముందే నూతనఅడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్‌పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్లు చేస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి ముందస్తు అడ్మిషన్లుచేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.

చొప్పదండి: విద్యార్థులు ఏకాగ్రతతో ఉంటేనే విద్యారంగంలో రాణిస్తారని మార్కెట్‌కమిటీచైర్మన్ కొత్తూరు మహేష్ అన్నారు. పట్టణంలోని ఆకాష్ పబ్లిక్‌స్కూల్‌లో నిర్వహించిన పాఠశాల ద్వితీయ వార్షికోత్సవంలో ఆయనపాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థిక్షేత్రస్థాయిలోనే ఏకాగ్రతతో విద్యాభ్యాసం కొనసాగిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని అన్నారు.

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామానికిచెందిన ప్రముఖవిద్యావేత్త డాక్టర్ వేముగంటి వరప్రసాద్‌రావు తత్వవేత్త అవార్డు అందుకున్నట్లు గురువారం గ్రామస్థులు తెలిపారు. వరప్రసాద్‌రావు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల కాలేజీల్లో ఉపన్యాసాలు, అంతర్జాతీయ యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్‌గా సేవలందించారు. అలాగే అంతర్జాతీయ జర్నల్‌లో వృక్ష శాస్త్రంలో అనేక వ్యాసాలు రచించారు.

రామడుగు: మండలంలోని గుండి ప్రాథమికపాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి అంబటివేణుకుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోచేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

గంగాధర: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు జిల్లాయువత అధికసంఖ్యలో తరలిరావాలని బీఆర్‌ఎస్వీ జిల్లాకోఆర్డినేటర్ ద్యావ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన గంగాధరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరంగల్ జిల్లాఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు యువత అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

జమ్మికుంట: ఐఐటీ,జేఈఈ,నీట్ లాంటి పోటీ పరీక్షలు ఎదుర్కొనే విధంగా ఇకపై 6వతరగతి నుంచి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు విద్యోదయ విద్యాసంస్థ చైర్మన్ ఏబూషి కౌశిక్ తెలిపారు.

22న సీతారామచంద్రస్వామి హుండీ లెక్కింపు

ఇల్లందకుంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామ చంద్ర స్వామి ఆలయంలో జరిగిన బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ముగిసినట్లు ఆలయ ఈవో కందుల సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్వామివారి హుండీని ఈనెల22న ఉదయం 9గంటలకు దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కిస్తామన్నారు. హుండీ డబ్బులు లెక్కింపులో పాల్గొనే భక్తులు డ్రెస్‌కోడ్ పాటించాలని కోరారు.

మొలంగూర్ ఖిల్లాను జాతీయ వారసత్వ సంపదగా గుర్తించాలి

శంకరపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ ఖిల్లాను జాతీయ వారసత్వ సంపదగా గుర్తించాలని బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ గురు వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు ఢిల్లీలోని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ సికావత్, సహాయమంత్రి సురేష్‌గోపి, సంస్కృతిశాఖ కార్యదర్శి అరుణిస్ చావ్లా, అదనపు కార్యదర్శి రాంజనచోప్రా, సంచాలకులుయశ్వీర్‌సింగ్, పర్యటక శాఖకార్యదర్శి విద్యావతి, తదితరులకువినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

హుజూరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. గురువారం హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ప్రదేశాలను గుర్తించారు. అనంతరం ఏసీపీ శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ ప్రమాదాలకు కారణమయ్యే ప్రదేశాల్లో రంబుల్ స్ట్రిప్స్, బ్లింకర్స్‌తోపాటు రోడ్డుప్రమాద హెచ్చరిక బోర్డు లను ఏర్పాటు చేయాలన్నారు. రాత్రివేళలో ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేసేలా కృషి చేస్తామన్నారు. అలాగే హైవే అధికారులతో మెరుగైన సమన్వయం కోసం ఒకవాట్సాప్ గ్రూప్‌నుకూడా ఏర్పాటు చేశామన్నారు.

గ్రామాల్లోని పాఠశాలల్లో ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమం

హుజూరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంతోపాటు ఇప్పల్‌నర్సింగాపూర్, కాట్రపల్లి, ఇందిరానగర్, రంగాపూర్, పోతిరెడ్డిపేట గ్రామాల్లో ప్రభుత్వపాఠశాలలో గురువారం పాఠశాల ట్విన్నింగ్ ఆఫ్‌స్కూల్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి భూపతి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నిపాఠశాలలోని విద్యా ర్థులను ఒకదగ్గరికి చేర్చి ఆటపాటలతో అక్కడున్న పరిస్థితులను గమనిస్తూ జ్ఞానాన్ని ఒకరికొకరు పంచుకునేలా చేయడమే పాఠశాల జంటీకరణ ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సైదాపూర్/రామడుగు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెన్కేపల్లి విశాలసహకార పరపతి సంఘం అధ్యక్షుడు కొత్తతిరుపతి, రామడుగు మార్కెట్‌కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి అన్నారు. గురువారం వారు పలుగ్రామాల్లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ బొమ్మగాని రాజు, సీఈవో శ్రీధర్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ వెంకటేశం, మాజీఎంపీపీ కామినివీరేశం, రామడుగులో మండలఅధ్యక్షుడు జవ్వాజి హరీష్, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ పిండి సత్యం, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

గంగాధర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవో ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం గట్టుబూత్కూర్‌లో వర్క్‌సైట్ పాఠశాల 48మంది విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ట్రాక్‌షూట్లు, టీషర్టులు, షూలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, సీఆర్పీ మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు తప్పక వేయించాలి

గన్నేరువరం/వీణవంక, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలను తప్పనిసరి వేయించాలని జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ సుధాకర్ అన్నారు. గురు వారం మండలంలోని ఖాసింపేటలో నిర్వహించిన గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా అసిస్టెంట్‌డైరక్టర్ వినోద్‌కుమార్‌తోకలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధిసోకితే పాల దిగుబడి తగ్గిపోయి పశువులు మృతి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు గంప వెంకన్న, బద్దం సంపత్‌రెడ్డి, పాల ఉత్పత్తిదారుల డెయిరీ ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు. వీణవంక మండలంలోని కనపర్తి గ్రామంలో సైతం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేశారు.

అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ మోసం

గన్నేరువరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని బీజేపీ సంరచన సంయోగి ఇన్‌చార్జి, కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, బండి తిరుపతి, రామచంద్రం, గుంటుక లక్ష్మీపతి, కుర్ర హరీష్ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని మక్తపల్లి గ్రామంలో గురువారం జరిగిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవడానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వరాచారీ, నాయకులు గడ్డ అరుణ్, కళ్యాణ్‌చంద్ర, చింతం శ్రీనివాస్, బూట్ల శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

'జ్యోతిష్మతి'కి ఎన్‌బీఏ అక్రిడిటేషన్ గుర్తింపు పొడిగింపు

తిమ్మాపూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లోని సీఎస్‌ఈ, ఈసీఈ, ఈఈఈ మూడు విభాగాలకు సంబంధించి మరో మూడుసంవత్సరాలకి అంటే 2025-2028 వరకు ఎన్‌బీఏ(నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు పొడిగింపు లభించిందని జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. అక్రిడిటేషన్‌సంస్థవిద్య, పరిశోధన ప్రయత్నాలను మెరుగుపరచడానికి శక్తివంతమైన ప్రేరణగా పనిచేస్తుందని తెలిపారు. ఈ అక్రిడిటేషన్ పొడిగింపు కళాశాలలో పాఠ్యాంశాల పటిష్టతను, అధ్యాపకుల నిబద్ధతను, అధునాతనమౌలిక సదుపాయాలను, తెలియజేస్తుందని తెలిపారు. సహకారం అందించిన భాగస్వాములు,పూర్వవిద్యార్థులు,భాగస్వాములు,అధ్యాపకబృందం, విద్యార్థులు వారితల్లిదండ్రులకు, చైర్మన్‌సాగర్‌రావుకృతజ్ఞతలు తెలియజేశారు.

రేపు భూ భారతి చట్టంపై అవగాహన

హుజూరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో ఈనెల19న భూభారతి కొత్త ఆర్వోఆర్-2025చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తు న్నట్లు తహసీల్దార్ కనకయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లాకలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవోరమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తామని పేర్కొన్నా రు. రైతులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతి నిధులందరూ పాల్గొని, భూభారతిచట్టంలోని నియమాలను తెలుసుకోవా లని కోరారు.